25న గడ్డిఅన్నారం ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు

చైతన్యపురి: గడ్డిఅన్నారం ఆర్యవైశ్య సంఘం కార్యవర్గం ఎన్నికలు ఈ నెల 25న జరుగుతాయని చీఫ్ ఎన్నికల అధికారి చిదరా రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 20వ తేదీ ఉదయం 11 నుంచి 1 గంట వరకు సత్యనారాయణ స్వామి దేవస్థానం కల్యాణ మండపంలో నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. 21వ తేదీ 11 నుంచి 12.30 వరకు విత్‌డ్రా చేసుకోవచ్చని, 22న స్క్రూటినీ ఉంటుందన్నారు. 25వ తేదీ ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కోదండరాంనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. పోటీ చేయగోరు అభ్యర్థులు ఎన్నికాధికారిని ఫోన్ నం. 8555045634లో సంప్రదించాలన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌ల్లో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 13, వంకాయ 18, బెండ 45, పచ్చిమిర్చి 45, కాకర 45, బీర 45, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 23, క్యారెట్ 20. దొండ 42, ఆలు 21, ఉల్లి 19, గోకర 45, దోస 21, సొర 09, పొట్ల 18, అరటి 10, చిక్కుడు 45, అర్వి 50, మునగ 55, చిలగడదుంప 60, బీట్‌రూట్ 19, కీర 25, ఫ్రెంచ్ బీన్స్ 45, కాప్సికమ్ 57. ఈ ధరలు శనివారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు, పలు మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో కింద తెలిపిన ప్రాంతాల్లో శనివారం కరెంట్ సరఫరా ఉండదని డీఈ హన్మంత్ రెడ్డి తెలిపారు.

◆ మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు..
శ్రీకార్ హోటల్, భోజిరెడ్డి కాలేజీ, గణేష్ టెంపుల్, వినయ్‌నగర్ కాలనీ, పూసలబస్తీ, ఇండియన్ పెట్రోల్ పంప్ పరిసర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని ఆయన తెలిపారు.

నూతన ఏసీపీకి సన్మానం



మన్సూరాబాద్: ఎల్‌బీనగర్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ)గా కొత్తగా బాధ్యతలు చేపట్టిన కృష్ణయ్యను రాష్ట్ర గీత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కొండ జానయ్యగౌడ్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నేతలు శుక్రవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులుగౌడ్, వెంకన్నగౌడ్, జాలె వెంకట్‌రెడ్డి దుబ్బాక గోపాల్‌రెడ్డి, ఎర్ర శేఖర్‌గౌడ్, కడారి బాలకృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

లింగోజిగూడ: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటిస్తూ వేగంగా పూర్తి చేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ తెలిపారు. డివిజన్ పరిధిలోని న్యూ మారుతీనగర్‌లో శుక్రవారం కాలనీవాసులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, అభివృద్ధి పనులపై అలసత్వం కారణంగా కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే పనులు పూర్తిచేసి సమస్యలు పరిష్కరించాలని ఏఈ మాతృనాయక్‌ను కోరారు. కాలనీ అధ్యక్షుడు దుడ్డు సుబ్రహ్మణ్యం, సుమన్, శివ తదితరులు పాల్గొన్నారు.

వాసవీక్లబ్ అధ్యక్షుడిగా సంతోష్‌కుమార్ గుప్తా



మన్సూరాబాద్: వాసవీ క్లబ్ మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడిగా మొరిశెట్టి సంతోష్‌కుమార్ గుప్తా, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసరావు, కోశాధికారిగా అంజిబాబు ఎన్నికయ్యారు. మన్సూరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా వీఎస్ గోల్డెన్ కేసీజీఎఫ్ అల్లాడి పరమేశ్వర్‌రావు, వైస్ గవర్నర్ వీఎస్ జి. నర్సింహులు, రీజియన్ చైర్మన్ వీఎస్ శ్యాంసుందర్ హాజరయ్యారు. కార్యక్రమంలో రీజియన్ సెక్రటరీ వీఎస్ శివనాగేశ్వర్‌రావు, జోన్ చైర్మన్ సాయి మోహన్, బద్రీనాథ్, విశ్వనాథ్, జనార్దన్, సత్యనారాయణ, అశోక్, శ్రీధర్, నరేందర్, గోపి, అనిల్‌కుమార్ రమేష్ పాల్గొన్నారు.

వాచ్‌మెన్ ఆత్మహత్య

సైదాబాద్: ఇంట్లో ఎవరూ లేని సమయంలో వాచ్‌మెన్ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సైదాబాద్ పోలీసుల కథనం ప్రకారం... మాతృశ్రీ కాలనీలోని శ్రీవైష్ణవి నిలయం అపార్ట్‌మెంట్‌లో కాకినాడకు చెందిన శ్రీనివాస్ (27) తల్లిదండ్రులతో కలిసి ఉంటూ అక్కడే వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. రెండు రోజుల క్రితం అతని తల్లిదండ్రులు కాకినాడకు వెళ్లారు. శుక్రవారం సాయంత్రం శ్రీనివాస్ తండ్రికి ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పి ఫోన్ కట్ చేశాడు. వెంటనే తండ్రి లక్ష్మీనగర్‌లో ఉండే కుమార్తెకు సమాచారం ఇవ్వగా ఆమె వెళ్లి చూసేసరికి శ్రీనివాస్ ఉరేసుకొని చనిపోయి ఉన్నాడు. సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తల్లిదండ్రులు వస్తే కానీ అతడి ఆత్మహత్యకు గల కారణాలు తెలిసే అవకాశం లేదని పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్‌లోకి బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు



కేఎల్లార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు

బడంగ్‌పేట్: మహేశ్వరం నియోజకర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సమక్షంలో మీర్‌పేట్ కార్పొరేషన్‌కు చెందిన ఇద్దరు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్పొరేటర్లు అరుణ, ప్రమీలకు కేఎల్లార్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. డివిజన్ల అభివృద్ధితో పాటు కేఎల్లార్ నాయకత్వంపై నమ్మకం ఏర్పడి కాంగ్రెస్‌లో చేరామని కార్పొరేటర్లు ప్రకటించారు. పార్టీలో చేరిన వారికి గుర్తింపు ఇస్తామని కేఎల్లార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు



వాసవి కాలనీలోని అష్టలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పండితులు



స్వామివారికి పూజలు నిర్వహించిన కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: అంతటా రథసప్తమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. శుక్రవారం మలక్‌పేట్ జోన్ పరిధిలోని ఆర్‌కేపురంలోని శ్రీఅష్టలక్ష్మి ఆలయం, మలక్‌పేట్, సైదాబాద్, ఐఎస్ సదన్, సరూర్‌నగర్, మాదన్నపేట్ తదితర ప్రాంతాల్లోని ఆలయాలలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

◆ ఆర్‌కేపురం డివిజన్‌లోని శ్రీఅష్టలక్ష్మి ఆలయంలో రథసప్తమి వేడుకలను నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు బారులు తీరి శ్రీమన్నారాయణస్వామి, అష్టలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, చిలుక ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు సంత్ సేవాలాల్



వేడుకల్లో పాల్గొన్న అడిషనల్ ఎస్పీ రాందాస్ తేజా తదితరులు

సైదాబాద్: బంజారాల ఆరాధ్య దైవం సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ అందరికీ ఆదర్శప్రాయుడని వనపర్తి అడిషనల్ ఎస్పీ రాందాస్ తేజా అన్నారు. ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీ రోడ్ నం-14లో సేవాలాల్ బంజారా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్ర మోతీలాల్ నాయక్, సంఘం మహిళా అధ్యక్షురాలు సక్రీబాయి ఆధ్వర్యంలో శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ మహాభోగ్ బండార్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ 285వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద బంజారాల సాంప్రదాయాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బంజారా మహిళలు సాంప్రదాయ గీతాలతో, నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజన్న, సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, ఎస్ఐ మోజీరాం, వ్యవసాయశాఖ అధికారి యాదగిరి నాయక్, ఆంజనేయులు, సంఘం ప్రతినిధులు గణేష్ నాయక్, జుక్కిబాయి, శాంతిబాయి, తార్యా పాల్గొన్నారు.

కారు డిక్కీలోని రూ.9 లక్షలు మాయం

మలక్‌పేట: కారు డిక్కీలో పెట్టిన రూ.9 లక్షల నగదు మాయమైన ఘటన మలక్‌పేట పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సలీంనగర్ శ్రీపురం కాలనీలో నివసించే వ్యాపారి రాజ్‌కుమార్ తన కారు డిక్కీలో రూ.9 లక్షల నగదు పెట్టాడు. గురువారం బంధువుల పెళ్లికి వెళ్లి వచ్చి కారును ఇంటి ముందు పార్కింగ్ చేశాడు. శుక్రవారం ఉదయం మరో పెళ్లికి హాజరై అంటికి వచ్చిన తరువాత డిక్కీలో పెట్టిన నగదు కోసం చూడగా కనిపించలేదు. దాంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస తెలిపారు.

తల్లీ కూతురు అదృశ్యం

మీర్‌పేట్ పీఎస్‌లో ఫిర్యాదు

బడంగ్‌పేట్: తల్లి, కూతురు అదృశ్య మైన ఘటన శుక్రవారం మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరి ధిలో జరిగింది. పో టలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివనారాయణపురం కాలనీలో నివాసం ఉంటున్న భోగి తేజ (38), కుమార్తె సాయిపల్లవిని ఈ నెల 12న తన వెంట తీసుకెళ్లిందని, అప్పటి నుంచి ఆమె మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చే శారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు పట్టుదల అవసరం



ఉద్యోగాలు సాధించిన వారిని సత్కరించిన డీసీపీ మధుకర్ స్వామి

చైతన్యపురి: ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు కృషి, పట్టుదల, క్రమశిక్షణ అవసరమని అంబర్‌పేట పీటీసీ ప్రిన్సిపాల్, డీసీపీ మధుకర్ స్వామి అన్నారు. చైతన్యపురిలోని శ్రీసాయి ఫంక్షన్ హాల్‌లో ఏస్ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన విజయోత్సవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని నిరుద్యోగ యువతకు దిశా నిర్దేశం చేశారు. పదేళ్లుగా ఎంతో మంది విద్యార్థులను ఏస్ సంస్థ తీర్చిదిద్దిందన్నారు. అనంతరం సంస్థ చైర్మన్ వినయ్ కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన కానిస్టేబుల్, ఎస్ఐ పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థులు ఎక్కువ మంది ఉద్యోగాలు సాధించారని అన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను డీసీపీ శాలువాలతో సత్కరించి మెమెంటోలు బహూకరించి అభినందించారు. డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు సైన్స్ ఎక్స్‌పో

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ హస్తినాపురం వెంకటరమణ కాలనీలోని రవీంద్రభారతి పాఠశాలలో శనివారం సైన్స్ ఎక్స్‌పో-2024 నిర్వహిస్తామని ప్రిన్సిపాళ్లు సూర్యనారాయణ, సందీప్ తెలిపారు. ఎక్స్‌పో లో విద్యార్థులు ఆయా సబ్జెక్టుల వారీగా రూపొందించిన నమూనాలను ప్రదర్శిస్తారన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సైన్స్ ఎక్స్‌పోను తిలకించాలని కోరారు.

అధిష్టానం న్యాయం చేయాలి: కోట్ల



దీపాదాస్ మున్షీని కలిసిన టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్ తదితరులు

సైదాబాద్: కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు దశాబ్దాలుగా కృషి చేసిన నాయకులకు అధిష్టానం తగిన గుర్తింపు ఇచ్చి న్యాయం చేయాలని టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీకి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ అధికారంలో లేకున్నా అప్పటి అధికార పార్టీ ఎన్ని ప్రలోభాలకు లోను చేసినా లొంగకుండా రాష్ట్రంలో కాంగ్రెస్ పటిష్టతకు తాము కృషి చేశామని వివరించారు. పార్టీ జెండా విడవకుండా అంకితభావంతో కృషి చేసిన నాయకులకు పార్టీ అధికారంలోకి వచ్చినందున తప్పనిసరిగా గుర్తింపు ఇవ్వాలని ఆమెను కోరారు. తమ వినతికి దీపాదాస్ మున్షీ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే పార్టీ నాయకులకు తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మె ప్రశాంతం



చైతన్యపురిలో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

మన్సూరాబాద్: దేశ వ్యాప్తంగా వివిధ ట్రేడ్ యూనియన్ల పిలుపులో భాగంగా శుక్రవారం ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కార్మికుల సమ్మె పాక్షికంగా, ప్రశాతంగా జరిగింది. కార్మిక సంఘాల నేతలు ర్యాలీలు నిర్వహించారు. ఆటోనగర్‌లో నిర్వహించిన ర్యాలీకి సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్, ఆల్ ఫెన్షనర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వర్గాలను చీల్చుతూ కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చిందని విమర్శించారు. రైతు లహక్కులను కాల రాసి కనీస మద్దతు ధరను ఎత్తివేసేందుకు యత్నిస్తోందని మండిపడ్డారు. సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసరీ నర్సిరెడ్డి, నాయకులు బ్రహ్మాచారి, ఆంజనేయులు, సుదర్శన్‌రెడ్డి, సోమయ్య, కృష్ణయ్య, లింగం, సుధీర్,కనకయ్య, మంజుల, లావణ్య, వెంకటమ్మ,శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

చైతన్యపురిలో...

సీఐటీయూ సరూర్‌నగర్ సర్కిల్ కార్యదర్శి మల్లెపాక వీరయ్య ఆధ్వర్యంలో చైతన్యపురిలో దేశ వ్యాప్త సమ్మె ర్యాలీని నిర్వహించి బంద్‌లో పాల్గొన్నారు. కార్యక్రమానికి మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోరవెంకుల నర్సింహ హాజరయ్యారు. మనోహర్, జలంధర్, చైతన్య, మల్లేష్, వెంకన్న, శ్రీనివాసులు, లతీఫ్, రవి, బాలస్వామి, బుచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర విధానాలతో ఇబ్బందులు

హయత్‌నగర్: కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు పెట్టుబడుదారులకు అనుకూలంగా మారాయని, కార్మికులు, రైతులు తమ హక్కులను కోల్పోతున్నారని సీఐటీయూ జిల్లా నాయకులు ఏర్పుల నర్సింహ అన్నారు. దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో హయత్‌నగర్‌లోని జాతీయ రహదారిపై మానవహారం నిర్వహించారు. నాయకులు గుండె శివకుమార్, ప్రభాకర్, భిక్షపతి, రమాదేవి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

లింగోజిగూడ: దేశవ్యాప్తంగా ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం చేపట్టిన బంద్‌లో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఐటీయూ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్ మాట్లాడుతూ, జీహెచ్‌ఎంసీ కార్మికులు, భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ఎల్‌బీనగర్ సర్కిల్ కన్వీనర్ ఎల్లయ్య, నాయకులు శ్రీనివాస్, దుర్గారావు, నగేష్, జంగయ్య, భాగ్యమ్మ, సంతోష్, కృష్ణమ్మ, జయమ్మ, యాదమ్మ, పద్మ, మంజుల, అంజయ్య, సుక్కమ్మ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



హయత్‌నగర్‌లో కార్మికుల మానవహారం



ఎల్‌బీనగర్‌లో సీఐటీయూ నాయకుల ర్యాలీ

ఫ్లైఓవర్లతో ట్రాఫిక్ సమస్యలకు చెక్



సాగర్ రింగ్ రోడ్డులో నిర్మిస్తున్న స్కై ఫ్లైఓవర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: ఫ్లైఓవర్లతో ట్రాఫిక్ సమస్యల నుంచి విముక్తి లభిస్తుందని, ఎల్‌బీనగర్‌లో ఉన్న ఫ్లైఓవర్లు ఎక్కడా కూడా లేవని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. సాగర్ రింగ్ రోడ్డు వద్ద నిర్మిస్తున్న నూతన స్కై ఫ్లైఓవర్‌ను ఆయన శక్రవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎన్నికల సందర్భంగా ఫ్లైఓవర్ పనులు కొంత మందగించాయని, ప్రస్తుతం పనులు పూర్తి కావడం సంతోషకరమన్నారు. ట్రాఫిక్ అధికంగా ఉన్న ఇతర ప్రాంతాలను కూడా పరిశీలించి అక్కడ కూడా కొత్త ఫ్లైఓవర్లను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అధికారులు దేవానంద్, రవీందర్, రాజు, పరమేష్, రోహిణి, కార్తీక్, నాయకులు అనంతుల రాజిరెడ్డి, చిరంజీవి, కిరణ్, బంటి శ్రీకాంత్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో కనీస వసతుల కల్పనకు చర్యలు



పాఠశాలలోని చెత్తను జేసీబీతో తొలగిస్తున్న ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధులు, శ్రీనివాస్‌యాదవ్

సాక్షి ఎఫెక్ట్..

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని భూపేశ్‌గుప్తానగర్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కనీస వసతులు కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చాయి. పాఠశాలలో సౌకర్యాల లేమి అనే శీర్షికతో ఈనెల 13న 'సాక్షి' ప్రచురించిన వార్తా కథనానికి స్పందించిన ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మీకోసం మేమున్నాం స్వచ్ఛంద సంస్థ చైర్మన్ నారగోని శ్రీనివాస్ యాదవ్ జేసీబీతో చెత్తాచెదారాన్ని తొలగింపజేశారు. పాఠశాల ఆవరణలో పిల్లలు ఆడుకోవడానికి క్రీడా స్థలంతో పాటు తాగడానికి నీరు ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. స్కూల్ పరిసరాల్లో నివసిస్తున్న నిరుపేదల పిల్లలు, విద్యార్థుల కోసం బోర్ వేయించి ఉదయం, సాయంత్రం వేళల్లో నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంవీ ఫౌండేషన్ హామీ ఇచ్చిందన్నారు. పాఠశాల ఆవరణలో పార్కులోని గ్రౌండ్‌ను సుందరీకరించి ప్రజలు, విద్యార్థులు వాకింగ్ చేసేందు వీలుగా వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు ఎంవీ ఫౌండేషన్ వారు ముందుకు వచ్చారని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. కార్యక్రమంలో వాంబేకాలనీ అధ్యక్షుడు నారాయణచారి, పాఠశాల ప్రధానోపాధ్యయులు డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలందిస్తున్నాం

వెల్‌నెస్ సెంటర్‌పై 'సాక్షి' కథనానికి వివరణ

వనస్థలిపురం: 'నామ్‌కే వాస్తేగా వెల్‌నెస్ సెంటర్', వైద్యులు, మందుల కొరత అంటూ శుక్రవారం 'సాక్షి' దినపత్రికలో వనస్థలిపురం వెల్‌నెస్ సెంటర్‌పై వచ్చిన కథనానికి వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు స్పందించారు. సెంటర్‌లో సమస్యలపై తగు వివరణ విడుదల చేశారు. సెంటర్‌లో ల్యాబ్ సౌకర్యం లేనందున రోగుల రక్త శాంపిళ్లను తెలంగాణ డయాగ్నస్టిక్స్ సెంట్రల్ ల్యాబ్‌కు పంపించి రిపోర్టులను పేషంట్ల మొబైల్ ఫోన్లకు పంపిస్తున్నామన్నారు. నలుగురు స్పెషలిస్ట్ వైద్యులు జనరల్ మెడిసిన్, ఆప్తమాలజిస్ట్, పీడియాట్రీషియన్, గైనకాలజిస్టులు సెంటర్‌లో అందుబాటులో ఉన్నారని తెలిపారు. వీరితో పాటు ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు, ఇద్దరు డెంటల్ డాక్టర్లు, ఇద్దరు ఫిజియోథెరపిస్టులు ఉన్నారన్నారు. షుగర్‌కు సంబంధించిన మందులు, ఇన్సులిన్లు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయని, ఏవైన మందులు లేకపోతే వెంటనే ఇండెంట్ పెట్టి తెప్పిస్తామన్నారు. ఎక్స్‌రే, అల్ట్రా సౌండ్, 2డీ ఎకో మిషన్స్ సెంటర్‌లో పని చేయడం లేదని, ఇదే ప్రాంగణంలో ఉన్న ఏరియా ఆసుపత్రి ల్యాబ్ నుంచి సేవలు అందేలా చూస్తున్నామని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు పేర్కొన్నారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



జాబ్ మేళాలో మాట్లాడుతున్న రాజేశ్వర్‌రెడ్డి

మలక్‌పేట: యువత తమకు వచ్చిన ఉపాధి, ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని నోబుల్ విద్యాసంస్థల చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. నోబుల్ డిగ్రీ, పీజీ కాలేజీ, మ్యాజిక్ షోను బస్ ఇండియా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం దిల్‌సుఖ్‌నగర్ కాలేజీలో నిర్వహించిన జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోటీ ప్రపంచంలో నైపుణ్యంతో కూడిన విషయ పరిజ్ఞానం అవసరమన్నారు. ఇంటర్వ్యూకు 350 మంది విద్యార్థులు హాజరు కాగా.. 150 మంది ఎంపికయ్యారన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మెడీప్లస్, హెచ్‌డీబీ ఫైనాన్స్ సర్వీస్, కానెక్ట్ క్యూ, హెచ్‌ఆర్‌హెచ్ నెక్స్ట్ సర్వీసెస్, రైటర్స్ పొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రామింగ్ మేనేజర్ రాకేష్, కాలేజ్ ప్రిన్సిపాల్ భాస్కర్‌రావు, వెంకటేష్, అరవింద్, సంధ్యారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా 'బచ్‌పన్ అకడమిక్ హైట్స్' వార్షికోత్సవం



పాఠశాల వార్షికోత్సవంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

వనస్థలిపురం: వనస్థలిపురం హిల్ కాలనీలోని బచ్‌పన్ అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవం గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ బచ్‌పన్ అకడమిక్స్ రీజనల్ డైరెక్టర్లు కె.శ్రీకాంత్‌రెడ్డి, కె.రూపారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ, ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని, మనోవికాసాన్ని కలిగిస్తాయన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో రీజనల్ ఆపరేషన్స్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్ కౌశిక్ రెడ్డి, మార్కెటింగ్ హెడ్ గిరీష్ మఖ్వానా, ప్రిన్సిపాల్ కల్పవల్లి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.